

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025 | 5



కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31(గురువారం)
కనిష్ఠం : 26

ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ 6

# రేపు సీఎం రాక



- కోనసీమ జిల్లా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో అధికారిక కార్యక్రమాలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లు చేస్తున్న కోనసీమ జిల్లా అధికార యంత్రాంగం
- సీఎం పర్యటన షెడ్యూల్ విడుదల

అమలాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 31న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గల ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీ4లో భాగంగా పేదల దత్తత కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉపాధి హామీ కూలీలతో మమేకమవుతారు. నలుగురు పెన్షనర్లతో మాట్లాడతారు. తర్వాత ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు.

**సీఎం పర్యటన సాగేదిలా..**

- ఆరోజు ఉదయం 9.30గంటలకు ఢిల్లీలోని జనపథ్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.10గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరతారు.
- 12.25 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరతారు.
- 12.50గంటలకు ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు సీఎంను కలుస్తారు.
- 1.20 గంటలనుంచి 2.05గంటల వరకు పీ4 కార్యక్రమంతోపాటు పింఛన్ల పంపిణీ తర్వాత గ్రామస్తులతో భేటీ అవుతారు.
- 2.05 గంటలకు బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి ట్యాంక్ ఏరియాకు చేరుకుంటారు.
- 2.10 గంటల నుంచి 3.30 గంటల వరకు గ్రామంలో ప్రజలతో మాట్లాడతారు.
- 3.35గంటల నుంచి 5 గంటల వరకు అక్కడే టీడీపీ కేడర్‌తో సమావేశమవుతారు.
- 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్‌లో బయలుదేరతారు.
- 6 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు.

# పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

- ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
- లారీ సహా రూ.22లక్షల విలువైన 730 కిలోల గంజాయి స్వాధీనం
- ఐదురోజుల క్రితం దేవరపల్లిలో మోటారుసైకిల్‌ను ఢీకొన్న లారీడ్రైవర్
- పోలీసులకు భయపడి అప్పటినుంచి లారీని యర్నగూడెంలో దాచిన వైనం
- సమాచారంతో పరిసరాల్లో వెతికి లారీని పట్టుకున్న పోలీసులు
- లారీ క్యాబిన్ వెనుక రహస్య అర కింద గంజాయి గుర్తింపు
- లారీడ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు

మెయిన్‌లో..



వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి పోలీసులు



లారీ క్యాబిన్ వెనుక ఏర్పాటు రహస్య అర

# కొంచెమే పెంపు

- ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం 7
- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా

# నో..పరేషన్



- ఉమ్మడి జిల్లాలో జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే బియ్యం
- పిఠాపురంలో ప్రారంభించనున్న సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల
- ప్రతినెలా 1వతేదీనుంచి 15తేదీ వరకు దుకాణాల్లో ఇచ్చేలా ప్రణాళిక
- వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పక్కాగా కొత్త విధానం అమలయ్యేలా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,857రేషన్ దుకాణాల్లో 17.46 లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం
- తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారుల పరిశీలన
- ఎండీయూ వాహనాల రద్దుతో ఇకపై కార్డుదారులకు తీరిన కష్టాలు
- నచ్చినప్పుడు రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకునే వీలు
- గత ప్రభుత్వంలో బియ్యం వాహనాలతో కార్డుదారులకు నరకం
- ఎప్పుడు బియ్యం బండి వస్తుందో తెలియక పడిగాపులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)
'ఎప్పుడు వస్తుందో తెలియదు.. ఎక్కడ ఉంటుందో తెలియదు.. ఎంతసేపు ఉంటుందో తెలియదు.. ఒకచోట మిస్సయితే.. మరో చోటకు వెళ్లి తెచ్చుకోవాలి. ఒక్కోసారి వాహనం కనిపించినా.. గంటల తరబడి సరకుల కోసం పడిగాపులు.. ఒక్కోసారి బియ్యం లేవనే సమాధానం..' గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలతో రేషన్ కార్డుదారుల అనుభవాలివీ.. వీటన్నింటికీ చెక్ పెడుతూ.. కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక జూన్ ఒకటో తేదీ నుంచి నేరుగా రేషన్ దుకాణాల నుంచే సరకులు పంపిణీ చేసేలా ఏర్పాటు చేస్తోంది. వైసీపీ హయాంలో ఇంటింటికి రేషన్ సరకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. కార్డుదారులను నడి వీధిలో నిలబెట్టింది. ఈ సమస్యను చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పాత విధానంలోనే రేషన్ దుకాణాల వద్దే సరకులు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,857 రేషన్ దుకాణాల్లో 17.46లక్షల మంది కార్డుదారులకు 26లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పక్కాగా సరఫరా చేసేలా డీలర్లను అప్రమత్తం చేసింది. రేషన్‌దుకాణాల్లో తూకం మోసం లేకుండా ఎలక్ట్రానిక్ కాటాలపై అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

**బెంగ లేదిక..**

జూన్ 1 నుంచి రేషన్‌దుకాణాల్లో బియ్యం పంపిణీ నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ, పౌరసరఫరాలశాఖల అధికారులు రేషన్ దుకాణాలకు సరకుల తరలింపు, కచ్చితమైన తూకంతో పేదలకు అందించే చర్యలు మొదలుపెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్లు వద్ద వే బ్రిడ్జిలను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. మరో మూడురోజులు మాత్రమే సమయం ఉండడంతో రేషన్ షాపులను సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రేషన్ సరకుల సరఫరాలో లోటుపాట్లపై డీలర్ల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇక తూనికలు, కొలతలశాఖల అధికారులు కూడా రేషన్ దుకాణాల్లోని కచ్చితమైన తూకాలు ఉండేలా యంత్రాలను పరిశీలిస్తున్నారు. చాలా వరకు డీలర్ల వద్ద ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు పాడైపోయిన నేపథ్యంలో వాటిని మరోసారి తనిఖీ చేసి, సీల్ వేస్తున్నారు. ఈ పనిలో ఐదురోజులుగా ఈ శాఖ అధికారులు బిజీగా ఉన్నారు. ఈనెల 30వ తేదీలోపు మొత్తం రేషన్ దుకాణాలన్నింటికీ సరకును రవాణా చేసేలా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**వైసీపీ హయాంలో..**

కాగా రేషన్ బియ్యాన్ని నెలలో తనకు కావలసిన సమయంలో కార్డుదారులు రేషన్ దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం 2019 వరకు అమలవగా తర్వాత జగన్ వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచారు. నచ్చిన రోజు, నచ్చిన సమయానికి రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకునే వెసులుబాటును రద్దు చేసి కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి వెళ్లి ఈ వాహనంలో బియ్యం పంచుతామని చెప్పి మాట మార్చారు. ఒక కాలనీకి వెళ్లి ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీవాసులు నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయిన పరిస్థితి తలెత్తింది. వేరే ప్రాంతంలో వాహనం కనిపిస్తే బియ్యం ఇచ్చేవారు కాదు. బియ్యం ఇచ్చినట్లే ఇచ్చి అక్కడే తిరిగి కొనేవారు. ఈ రేషన్ బియ్యం అంతా తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్‌మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి. రేషన్ మాఫియాకు ఇవి అడ్డగోలుగా ఉపయోగపడ్డాయి. బియ్యం వాహనాలను అప్పటి ప్రభుత్వం రూ.5.81లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72నెలల వాయిదాపై బ్యాంకునుంచి 2021, ఫిబ్రవరిలో రుణం తీసుకుంది. కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19కోట్లు రుణం ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పటికీ ఈరుణాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ వాహనాలపై రూ.6.83కోట్లు బాకీ ఉంది.



కాకినాడ రంగయ్యనాయుడు వీధిలోని ఓ రేషన్ దుకాణంలో తూకపు యంత్రాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖ అధికారులు

**ఏం జిల్లాలో ఎన్నంటే..**

కాకినాడ జిల్లాలో 1,060రేషన్ దుకాణాలు ఉండగా, వీటి పరిధిలో 6.43లక్షలమంది కార్డుదారులున్నారు. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38లక్షలమంది, తూర్పుగోదావరి జిల్లాలో 871దుకాణాల ద్వారా 5.65లక్షల మంది కార్డుదారులున్నారు. వీరందరికీ ఉమ్మడి జిల్లాలో 26లక్షల మెట్రిక్ టన్నుల వరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మేరకు అన్ని రేషన్ దుకాణాల్లో ఈ వ్యవస్థ పక్కాగా పనిచేసేలా మూడు జిల్లాల్లో పౌరసరఫరాలశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కార్డుదారులు నచ్చిన సమయంలో బియ్యం విడిపించుకునేందుకు వీలుగా 15రోజులపాటు దుకాణాల్లో బియ్యం ఉండేలా చూడాలని డీలర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల్లో ఈ నెల ఒకటి నుంచి 15 వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ దుకాణాలు తెరిచి ఉంచనున్నారు. షాపు పనివేళలు, ధరలు, సరకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని ఇప్పటికే డీలర్లకు అధికారులు ఆదేశాలిచ్చారు. ఇక 65ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# తవ్వేదెవరు

- జిల్లాకు కేటాయించిన ఇసుక ర్యాంపుల వెనుక ఎవరున్నారు
- కాంట్రాక్టు కంపెనీ కాకుండా ఇంకెవరు పెత్తనం చేస్తున్నారు
- ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'ఇసుకాసురుడు' కథనంపై కాకినాడ కలెక్టర్ ఆరా
- స్టాకు యార్డులకు ఇసుక రాకుండా అడ్డుకునే ప్రయత్నాలపై ఆగ్రహం
- ఎప్పటికప్పుడు స్టాకు యార్డులకు వస్తోన్న ఇసుకపై పర్యవేక్షణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
కాకినాడ జిల్లా ఇసుక అవసరాలు తీర్చడానికి కేటాయించిన ర్యాంపుల్లో వైసీపీ నేత ద్వారంపూడి అనుచరుడి పెత్తనంపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆరా తీశారు. కోనసీమ జిల్లాలోని పొడగట్లపల్లి, తూర్పుగోదావరిజిల్లాలో కాటవరం ర్యాంపులు అధికారికంగా కాంట్రాక్టు కంపెనీలకు కేటాయిస్తే వీటిలో వేరొకరు పాగా వేసి ఇసుక అక్రమాలు చేస్తుండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు తెరవెనుక దందా చేస్తోన్న నేత గురించి ఆరా తీశారు. రీచ్‌లు దక్కించుకున్న కంపెనీలకు, సదరు చీకటి నేతకు సంబంధాలేంటనేదానిపై కలెక్టరేట్ అధికారుల ద్వారా లోతుగా గుట్టు సేకరించారు. రీచ్‌లపై అనధికార వ్యక్తుల పెత్తనం సహించేదిలేదని అధికారులవద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటి పేరుగా మార్చుకున్న వైసీపీ నేత చెలరేగిపోయాడు. ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో గ్రావెల్ అక్రమాలకు తెగబడ్డాడు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అదే నేత ఇంకా దందాలు చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'ఇసుకాసురుడు' అనే శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై కాకినాడ కలెక్టర్ ఆరాతీశారు. జిల్లాలో ఇసుక స్టాకుయార్డులకు రీచ్‌ల నుంచి ఇసుక ఇవ్వకుండా ద్వారంపూడి అనుచరుడు బెదిరింపులకు దిగుతున్న వ్యక్తి ఎవరనేదానిపై ఆరా తీశారు. అసలు రీచ్‌ల్లో ఏం జరుగుతుందో వివరాలు రప్పించుకున్నారు. రీచ్‌ల్లో అనధికార వ్యక్తుల పెత్తనం చేస్తే కాంట్రాక్టు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అసలే వచ్చేది వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు ఇసుక ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి స్టాకుయార్డులోను ఇసుక తగినంత ఉండేలా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షణ మొదలుపెట్టారు. ప్రస్తుతం జిల్లాలో పెద్దాపురం,పిఠాపురం, కాకినాడ, కాకినాడలో ఉప్పలంక, కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు స్టాకుయార్డుల్లో ఈనెల 27నాటికి 1,37,791మెట్రిక్ టన్నులు ఉందని అధికారులు వివరించారు. ఇదిరోజురోజుకు మారుతుందని తెలిపారు. మరోపక్క తమకు దక్కిన రీచ్‌ల వెనుక వైసీపీ నేత పెత్తనం కొనసాగుతుందన్న విషయం బయటకు పొక్కడంతో సదరు నిర్వాహకులు ఆంధ్రజ్యోతి కథనం ఉలిక్కిపడ్డారు. ఏ స్టాకు యార్డు నుంచి నిజాలు బయటకు పొక్కాయి అనేదానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు.

పోలీస్‌స్టేషన్ వద్ద గాయాలతో వ్యక్తి హల్‌చల్ 7

# ప్రైవేట్ పాఠశాలల్లో లాటరీ ద్వారా 1812 సీట్లు కేటాయింపు: సమగ్రశిక్ష పీవో

సర్పవరం జంక్షన్, మే 29(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి 1,812 సీట్లు కేటాయించినట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో మొదటి దశ లాటరీ ద్వారా మండలాలవారీగా రాష్ట్ర కార్యాలయం నుంచి గురువారం ఈ సీట్లు కేటాయించారని ఆయన స్పష్టం చేశారు. మండలాల వారీగా గండేపల్లి-22, గొల్లప్రోలు-62, జగ్గంపేట-63, కాజులూరు-18, కాకినాడ రూరల్ -172, కాకినాడ అర్బన్-439, కరప-56, కిర్లంపూడి-65, కోటనందూరు-15, పెదపూడి-16, పెద్దాపురం-104, పిఠాపురం-233, ప్రత్తిపాడు- 44, రౌతులపూడి-11. సామర్లకోట-135, శంఖ వరం-36, తాళ్లరేవు-41, తొండంగి-14, తుని-207, ఉప్పాడ కొత్తపల్లి-22, ఏలేశ్వరం-37 సీట్లను మొదటిదశలో లాటరీ ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంఎస్‌లో వచ్చిన సందేశం ద్వారా సంబంధిత ప్రైవేట్ పాఠశాలను సంప్రదించి ఉచితంగా అడ్మిషన్ పొందాలని కోరారు. ఈ నెల 29 నుంచి జూన్ 7 లోపు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం అడ్మిషన్లు పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. ఎవరైనా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందికి గురిచేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు.

## పనామా-భారతదేశాల మధ్య..

# బంధం మరింత బలోపేతం

- అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం,మే 29(ఆంధ్రజ్యోతి):పనామా-భారతదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద దుశ్చర్యలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ బృందం గురువారం పనామా దేశం చేరుకుంది. ఈ సందర్భంగా పనామా దేశఅధ్యక్షుడు జోస్‌రౌలీములినీతో అఖిలపక్ష బృందం సమావేశమైంది. సమావేశంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు కాశ్మీర్‌లోను, పహల్గాంలో జరిపిన మారణకాండ, మన దేశం చేసిన ఆపరేషన్ సింధూర్ గురించి ఆయనకు వివరించామని ఎంపీ హరీష్ తెలిపారు. ఉగ్రవాదంపై భారత దేశం తీసుకున్న స్పష్టమైన నైతికమైన నిర్ణయానికి పనామా దేశ ప్రభుత్వ స్పందన ప్రశంసనీయమన్నారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ దేశ, ప్రపంచ దేశాల భద్రత కోసం మన దేశం తీసుకుంటున్న చర్యలకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. సమావేశంలో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించామని తెలిపారు.




పనామా దేశ అధ్యక్షుడు జోస్‌రౌలీములినితో అఖిలపక్ష బృందంలో పాల్గొన్న అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్

# సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

- హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఇంటెలిజెన్స్ అధికారి, ఎమ్మెల్యే



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ నెల 31న సీఎం చంద్రబాబు ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో పర్యటించనున్నందున అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి ఎక్కడా లోటుపాట్లు చోటు చేసుకోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి క్షేత్రస్థాయిలో గురువారం ముందస్తు ఏర్పాట్లను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, ప్రాంతీయ ఇంటిలిజెన్స్ అధికారి కృష్ణారావు, జిల్లాస్థాయి అధికారులతో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ పర్యటన నిర్వహించారు. ముందుగా సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. చెయ్యేరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.9లక్షల88వేలతో చేపట్టిన చెరువు పూడికతీత అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. స్థానికంగా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ వేదిక ఏర్పాట్లను పరిశీలించి చెయ్యేరు జడ్పీ ఉన్నత పాఠశాల వెనుకభాగంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికను పరిశీలించారు. అనంతరం సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి గుడి వద్ద పార్టీ కేడర్‌తో సమావేశమయ్యే స్థలాన్ని వారు పరిశీలించారు.

# గ్రంథాలయాల్లో పారదర్శకంగా బదిలీలు: జేసీ రాహుల్‌మీనా



ఉద్యోగులకు బదిలీల ఉత్తర్వులను అందజేస్తున్న జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రంథాలయ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించినట్లు జేసీ రాహుల్‌మీనా తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు జేసీ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా బదిలీల కౌన్సెలింగ్ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి ఐదేళ్లు పూర్తిచేసుకున్నవారికి బదిలీలు చేశామన్నారు. వివిధ కారణాలతో రిక్వెస్ట్ చేసుకున్న 15 మంది ఉద్యోగులను వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్ల ప్రకారం బదిలీ చేశామన్నారు. ఉద్యోగులు బదిలీ చేయబడిన ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. తమ పరిధిలో గ్రంథాలయాల సెస్ వసూళ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అనంతరం బదిలీల ఉత్తర్వులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి నాగరాజు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వీధి సుబ్రహ్మణ్యం సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం



నవీన్‌కుమార్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు వీధి సుబ్రహ్మణ్యానికి సంబంధించి అతడి సోదరుడు వీధి నవీన్‌కుమార్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి నియామక పత్రాన్ని జేసీ రాహుల్‌మీనా గురువారం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ శ్రీనివాసరావు, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొన్నారు.



'మహాసైకిల్



సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక



సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



# మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







కొమరగిరి పెద్ద చెరువులో చేపలు పడుతున్న దృశ్యం (పాత చిత్రం)



వింటే భారతం వినాలి... తింటే గారెలే తినాలి అనే సామెత పాతదైనా ఆ గ్రామానికి చెందిన చెరువు చేపను సంవత్సరానికి ఒకసారైనా తినాలనే కోరికతో కొత్తపల్లి మండల ప్రజలు ఉవ్విళ్లూరుతుంటారు. దాంతో చేపలు పట్టే రోజుకి చేతుల్లో డబ్బులు లేకపోయినప్పటికీ అప్పోసొప్పో చేసి లేక ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి మరీ చేపలు కొనుగోలు చేయడం విశేషం.




# రుచి అమోఘం

- కొమరగిరి పెద్ద చెరువు చేపలకు డిమాండ్
- వస్తువులను తాకట్టు పెట్టయినా సరే కొనాల్సిందే
- సంవత్సరానికి ఒకసారే పట్టుబడి




కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు ఉంది. ఇందులో సంవత్సరానికి ఒకసారే చేపలు పట్టుబడి పడతారు. పంచాయతీకి చెందిన ఈ చెరువును స్థానికంగా మకాం ఉండే పల్లీలు లీజుకు తీసుకుని చేపలు పండిస్తారు. ప్రతి సంవత్సరం జూన్ నెల దాటాక చెరువు చేపల్లో మంచివైన రాగండి, బొచ్చు, గడ్డి, చెరువు సంధువాలు, ఎర్రమైల, వాలుగు తదితర రకాలకు చెందిన చేపల పిల్లలను వేస్తారు. మరలా మే నెల వచ్చే వరకు ఆ చెరువు వద్దకు పల్లీలు వెళ్లరు. అంతేగాక చేప పిల్లలకు ఎటువంటి ఆహారం వేయరు. చెరువులో ఉండే గడ్డి, నాచు, తూటికాడ, పొన్నగంటి కూరలను ఆహారంగా తింటాయి. సుమారు సంవత్సరం పాటు పెరిగిన చేపలు ఒక్కొక్కటి ఐదు నుంచి 8 కిలోల బరువు పెరుగుతాయి. వాటిని వారంలో రెండు లేక మూడు రోజులు పట్టుబడి పడతారు. కిలో రూ.130 చొప్పున తొలుత గ్రామ ప్రజలకు టోకెన్ల ద్వారా అమ్ముతారు. వారు వాటిని కొనుగోలు చేసి పొరుగూళ్లలో వున్న బంధువులు, స్నేహితులు, రాజకీయ ప్రముఖులకు పంపిస్తారు. ఆ తర్వాత వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు కిలో రూ.150 చొప్పున విక్రయిస్తారు. ఎటువంటి మేత (ఆహారం) వేయకుండా కేవలం గడ్డి, తూటికాడ, పొన్నగంటి కూరలను మేతగా తిన్న చేపల రుచి అమోఘంగా ఉంటుందని ఇక్కడి ప్రజలు చెప్తున్నారు. ఈ చేపలను వేపుడు లేదా పులుసు చేసుకుని మాంసాహారప్రియులు లొట్టలేసుకుని తింటారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కొమరగిరి చెరువులో చేపలు ఎప్పుడు పడతారా అని బంధువులను ఆరా తీయడం గమనార్హం.



కొమరగిరి చెరువు వద్ద చేపల కొనుగోలుకు గుమిగూడిన ప్రజలు (పాత చిత్రం)



ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ప్రధానోపాధ్యాయులు

## ఉపాధ్యాయుల బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

కాకినాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ కేడర్లలో 8,839 మంది వివరాలు నమోదు చేసుకున్నారు. వారిలో 4,352 మంది ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారున్నారు. 4,487 మంది రిక్వెస్ట్ పెట్టుకున్నారు. హెచ్‌ఎంలకు సంబంధించి సీనియారిటీ జాబితా, అభ్యంతరాల స్వీకరణ ఇప్పటికే పూర్తయ్యింది. బుధవారం వెబ్ ఆప్షన్లు కూడా తొలగించడంతో వారంతా తదుపరి ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసే పనిలో విద్యా శాఖ నిమగ్నమైంది. శుక్రవారం నాటికి కొలిక్కివచ్చే అవకాశముంది. జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ప్రచురిస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఉద్యోగోన్నతులకు 252 మంది స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న 111మంది హెచ్‌ఎంలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు కాకినాడ జిల్లా డీఈవో రమేష్ తెలిపారు.

| కేటగిరీ | తప్పనిసరి బదిలీ | రిక్వెస్ట్ | మొత్తం |
|---|---|---|---|
| ప్రధానోపాధ్యాయులు | 66 | 179 | 245 |
| స్కూల్ అసిస్టెంట్లు | 2217 | 2368 | 4585 |
| ఎస్జీటీలు | 2069 | 1940 | 4009 |

## సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, మే 29 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్, జేఎన్టీయూకే మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర నాథ్ తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ హెచ్ భారతి హొల్లికేరి ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్శిటీలోని ఐఆర్‌సీలో సెంటర్ ఫర్ సెన్సస్ మైక్రోడేటా పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించామని, దీనికి యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఆర్ దీక్షితులు నోడల్ అధికారిగా నియమితులయ్యారన్నారు. భారతి హల్లికేరి మాట్లాడుతూ జనగణనను ఇప్పటివరకు 15సార్లు చేపట్టామన్నారు. కొవిడ్ కారణంగా 16వ జనగణన చేపట్టలేదని, ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ హోమ్ అఫైర్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ శశికుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుప్రెజ్, రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు బాలకృష్ణ, కృష్ణప్రసాద్, పద్మజారాణి, గోపాలకృష్ణ, మాజీ వీసీలు శ్రీనివాస్‌కుమార్, పద్మరాజు పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ, సీసీఎండీఆర్‌సీ ప్రతినిధులు

## మహీరమ కలం నుంచి ఆంగ్ల ఫిక్షన్ నవల

### ఆవిష్కరించిన నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన చల్లా మహీరమ ఆసక్తికర కథనంతో ఆంగ్ల ఫిక్షన్ నవల రాసి రికార్డు సృష్టించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. 13 ఏళ్ల మహీరమ రాసిన 'రూబీస్ బ్లూ స్ట్రీమ్ అండ్ ది బాండ్ ఆఫ్ ఫైర్' నవలను గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు చల్లా వెంకట సుబ్బరాయశాస్త్రి మనుమరాలైన మహీరమ ప్రకృతి, పంచభూతాల కథాంశంగా ఫిక్షన్ నవల రాసిందన్నారు. ఆరవ ఏట వరకు అమెరికాలో పెరిగిన మహీరమ తండ్రి రోషన్‌కృష్ణ ఉద్యోగరీత్యా ప్రస్తుతం హైదరాబాద్‌లో 9వ తరగతి చదువుతోందని తెలిపారు. రచయిత్రి మహీరమ మాట్లాడుతూ... ప్రకృతితో మానవుడి అనుబంధం, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తే కలిగే పర్యవసానాలు, జీవితగమ్యాన్ని ఈ రచన ద్వారా చెప్పానన్నారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు, తాత, మామ్మలకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహీరమ తల్లి సాయిసుధ, అమ్మమ్మ, తాతయ్య గోపాలమ్మ, ఏపీఎస్ రాజు, స్పృహ అలూమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర నాగేంద్రకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మహీరమ రాసిన నవలను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ

# కొంచెమే పెంపు



## ధాన్యానికి కనీస మద్దతు ధర పెంచిన కేంద్రం

- క్వింటాలుకు రూ.69 పెంపు
- గ్రేడ్ ఏ రకం రూ.2,369
- సాధారణ రకం రూ.2,252
- ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
- పెదవి విరుస్తున్న రైతులు

సామర్లకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): మే నెలలో ధాన్యానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెరిగింది. క్వింటాలుకు రూ.69 పెరిగింది. గతేడాది గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2,320గా కేంద్రం ప్రకటించగా ఈ ఏడాది మరో రూ.69 పెంచడంతో రూ.2,369కి చేరింది. సాధారణ రకం ధాన్యం రూ.2,183 ఉండగా ఈ ఏడాది రూ.69 ప్రక టించడంతో రూ.2,252కి చేరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదే శాలతో సీఏపీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బుధవారం సాయంత్రం కనీస మద్దతు ధరలను ప్రకటించింది. తాజా మద్దతు ధరతో రానున్న 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు చేసేందుకు వీలుగా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేయాల్సిఉంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5.54 లక్షల ఎకరాల పరిధిలో 14.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ప్రభావం లేకపోతే ఎకరాకు వరికి 4.5 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాలుకు రూ.69 పెంచడంతో ఉమ్మడి జిల్లాలో రైతులకు రూ.180కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

### సాగు ఖర్చులతో పోలిస్తే...

వరి మొక్కజొన్న తదితర 16 పంటలకు సంబంధించి మద్దతు ధరలను పెంచుతూ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్ (సీఏపీసీ) కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పెసలు కనీస మద్దతు ధరను 10.4 శాతం మేర పెంచి రూ.8,768గా నిర్ణయించింది. గతేడాది పెసలు క్వింటాలుకు రూ.8,682గా ఉంది. పెసలపై 8 శాతం పెంచగా, వరికి కేవలం 6 శాతం మాత్రమే పెంచింది. ఈ పెంపుదల ధరలు వరికే అత్యధికం అని కేంద్రప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ పెరి గిన సాగుఖర్చులుతో పోలిస్తే ఇది ఏమంత అధికం కాదని రైతులు చెప్తున్నారు. ఈ సిఫార్సులను కేంద్ర మంత్రివర్గ ఆమోదంతో సాధారణ రకం, గ్రేడ్ ఏ రకాలకు ప్రస్తుతం చెల్లిస్తున్న ధర కంటే రూ.69 చొప్పున పెంచడానికి సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 330 ధాన్యం కొనుగోలు కేంద్రాల వరకూ ఏర్పాటు చేసి ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగా కొనుగోలు చేపట్టలేకపోగా రానున్న ఖరీఫ్ నాటికి 5.54 లక్షల ఎకరాల్లో సాగు ద్వారా వచ్చే 16.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది. ఇక ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.69 మాత్రమే పెంపుదల చేయడంతో రైతాంగం పెదవి విరు స్తుంది. సాగుకు పెట్టుబడులు అధికమవుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా మద్దతు ధర లభించడం లేదని రైతులు, రైతు సంఘాల ప్రతి నిధులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం అయినా చేయకుండా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తుందని పాలక ప్రభుత్వాలపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మిగిలిన పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు

మొక్కజొన్న క్వింటాకు రూ.175
కందులు క్వింటాకు రూ.450
మినుములు క్వింటాకు రూ.400
వేరుశెనగ క్వింటాకు రూ.480
పత్తి క్వింటాకు రూ.589

### చేతి చమురు వదిలించుకోవాల్సిందే...

ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన వరిపంటకు కేంద్రం మద్దతు ధర ప్రకటించినా, ఏటా మిల్లర్లు రైతులకు మద్దతు ధర అందివ్వని పరిస్థితి నెలకొంది. రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని అందజేస్తున్నా, తమకు మాత్రం మద్దతు కరువవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభిప్రాయం ఎకరాకు సగటున 48 బస్తాల వరకూ దిగుబడులు వస్తాయని వ్యవ సాయ శాఖ అంచనా వేయగా క్వింటాలుకు కేం ద్రం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి 2,389 ప్రకారం బస్తాకు రూ.1,791.75 వస్తుంది. మొత్తం 48బస్తాలకు రూ.86,004 వస్తుంది. కానీ ఎకరానికి పెట్టుబడిగా రూ.70వేల వరకూ పెట్టుబడి వ్యయం అవుతుండగా, రైతుకు మిగి లేది కేవలం 16,004 మాత్రమే. అదే రైతు కూలీ పనులకు వెళితే పంట సాగుకాలంలో రూ.80 వేల వరకూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. అది కూడా ఏ-గ్రేడ్ రకానికి మాత్రమే సొంతభూమి సాగు చేసుకునే రైతుకు కొంత మిగులు కనిపి ంచే అవకాశం ఉండగా కౌలు రైతు, ప్రభుత్వం ముద్దుగా పిలుచుకొనే సాగుహక్కుదారుడు చేతి చమురు వదిలించుకోవాల్సిందే. సాధారణంగా ఖరీఫ్‌లో సాగు హక్కుదారులకు ఏమీ మిగలదు. రబీలో లాభం ఉంటుందనే ఆశతోనే సాగులోకి దిగుతారు. అన్ని అవరోధాలను దాటుకుని సాగు చేసినా చేతికి మిగిలేది రెండు పదులు కూడా దాటని పరిస్థితి. అయితే మద్దతు ధర గణనీయంగా పెరిగితేనే రైతులకు ఎంతోకొంత మిగులుతుంది.



# ఎట్టకేలకు.. హెచ్చరిక బోర్డు




అన్నవరంలో పంపా తీరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం వద్ద పంపా కొలనులో దిగి యువకుడు మృతిచెందిన సంఘటన విధితమే. అయితే స్వామివారి కల్యాణోత్సవ చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన కొలను ఈ ప్రమాదానికి కారణమైంది. దీంతో కార్యక్రమం ఈనెల 12తో ముగిసినా కొలను వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో నిండుప్రాణం బలైంది. దీంతో అధికారులు గురువారం పంపా తీరం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## ఆరడుగుల.. గోధుమ తాచుపాము హల్‌చల్

అంబాజీపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట విజ్జపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో ఆరడుగుల గోధుమ రంగు తాచుపాము గురువారం భయభ్రాంతులను గురి చేసింది. దీంతో వెంకట్రాజు స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో అతడు అక్కడకు చేరుకుని రేకుల కింద ఉన్న తాచుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు. ఆ పాము దూరప్రాంతంలో విడిచిపెడతానని వర్మ తెలిపాడు.



అంబాజీపేటలో తాచుపామును పట్టుకున్న వర్మ

## అన్నవరం దేవస్థానం
# ఏఈవోపై సీఎంవోకు ఫిర్యాదు

- శ్రీపుష్పయోగం రోజున భక్తురాలిపై అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు
- ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిని నియమించిన ఈవో

అన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆలయ విభాగ ఏఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండలరావుపై ఒక భక్తుడు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం రత్నగిరిపై చర్చనీయాంశమైంది. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల ముగింపు శ్రీపుష్పయోగం రోజున ఏఈవో కొండరావు ఒక మహిళపై దురుసుగా ప్రవర్తించడంతో పాటుగా తాకరాని ప్రదేశంలో చెయ్యిపెట్టి తోసేశారని ఫిర్యాదు చేయడంతో సీఎంవో కార్యాలయం విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. దీంతో ఈవో వీర్ల సుబ్బారావు అతనిని ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి విచారణాధికారిగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌ను నియమించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల దేవస్థానంలో సేవ చేసేందుకు విచ్చేసిన సేవకులపై కూడా ఏఈవో దురుసుగా మాట్లాడడంతో దేవదాయ కమిషనర్ విచారణకు ఆదేశించిన సంగతి విధితమే. మరో నెలరోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆయన ఈ విధంగా ప్రవర్తించడం, వివాదాలకు కారణమవుతుండడంతో ఆలయఉద్యోగులు దీనిపై చర్చించుకుంటున్నారు.

# ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

- గర్భవతిని చేసి పరారైన యువకుడిపై పోక్సో కేసు నమోదు

కె.గంగవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని ఓ గ్రామంలో బాలికను అదే గ్రామానికి చెందిన మండపల్లి సాగర్ అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేశాడు. బాలిక ప్రస్తుతం 7 నెలల గర్భవతి. దీనిపై పామర్రు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. డీఎస్పీ రఘువీర్, అమలాపురం మహిళా ఎస్ఐ గంగాభవానిలు బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మండపల్లి సాగర్ తను నివాసం ఉంటున్న కాలనీలోని ఓ మైనర్‌ను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. అప్పటి నుంచి పెళ్లి చేసుకోమని అడుగుతుంటే కుదరదని చెబుతూ ఉన్నాడు. బాలిక కుటుంబీకులు స్థానిక పెద్దలను ఆశ్రయించారు. అక్కడ వారికి న్యాయం జరగకపోవడంతో పామర్రు పోలీసులను ఆశ్రయించారు. గురువారం సాయంత్రం రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, పామర్రు ఎస్ఐ. ఎస్‌కె జానీ బాషా, అమలాపురం మహిళా ఎస్ఐ గంగా భవానీలు బాధితురాలి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే సాగర్ పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు.

## పోలీస్‌స్టేషన్ వద్ద
# రక్తపు గాయాలతో వ్యక్తి హల్‌చల్

జగ్గంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఖమ్మం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం రక్తపు గాయాలతో హల్‌చల్ చేశాడు. వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి జగ్గంపేటలో బాలాజీ రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేసుకుని రోడ్డుపై వెళ్తున్నవారితో అసభ్యంగా ప్రవరిస్తున్నాడని స్టేషన్‌లో అందిన సమాచారం ప్రకారం సిబ్బంది అతడి వద్ద ఫోన్‌ను తీసుకొచ్చారు. దీంతో ఆ వ్యక్తి స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులు దౌర్జన్యం నశించాలంటూ గాజు పెంకుతో ఒంటిపై కోసుకుని రక్తపు గాయాలతో ఉండగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయితే తను వద్ద నుంచి ఫోన్, రూ.50వేలు నగదు పోలీసులు తీసుకున్నారని సదరు వ్యక్తి వాపోతున్నాడు.



పోలీస్‌స్టేషన్ వద్ద హల్‌చల్ చేస్తున్న వ్యక్తి



## రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. హంసవరం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఏ ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్టు తెలిపారు. సంబంధికులెవరైనా ఉంటే రైల్వే పోలీసులను, రైల్వే ఫోన్ నెంబర్ 9490619020లో సంప్రదించాలని కోరారు.



హంసవరం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# సీఎం పర్యటనకు శరవేగంతో పనులు

- ముమ్మిడివరం నియోజకవర్గంలో రేపు చంద్రబాబు పర్యటన
- సిద్ధమవుతున్న ప్రజా వేదిక



చెయ్యేరులో ప్రజా వేదికను సిద్ధం చేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంతో సాగుతున్నాయి. ఈ నెల 31న ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగమంతా అక్కడే ఉండి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహిపాలచెరువు, పల్లంకుర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డును సీహెచ్ గున్నేపల్లి నుంచి చెయ్యేరు వరకు రోడ్డుపక్కన ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తీసివేసి శుభ్రం చేస్తున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యేందుకు సీహెచ్ గున్నేపల్లిలోని పాత ఓఎన్జీసీ సైట్‌లో ఉన్న కొబ్బరి పీచును తొలగించి హెలిప్యాడ్‌ను ఆధునీకరిస్తున్నారు. అక్కడ బారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రజావేదికకు సీఎం కాన్వాయ్ వెళ్లేందుకు హెలిప్యాడ్ నుంచి మెయిన్‌రోడ్డుకు రోడ్డును ఆధునీకరిస్తున్నారు. చెయ్యేరులో నిర్వహించే ప్రజా వేదికకు సంబంధించి వేదికను సిద్ధం చేస్తున్నారు. అక్కడ రోడ్లు కూడా ఆధునీకరిస్తున్నారు. పేదల సేవలో భాగంగా ముగ్గురు పేదలను దత్తత తీసుకునే కార్యక్రమానికి సంబంధించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజావేదికలో గ్రామస్తులతో మాట్లాడిన తరువాత ఉపాధిహామీ పథకంలో చెయ్యేరు ఆధునీకరిస్తున్న చెరువును పరిశీలించి అక్కడ ఉపాధిహామీ కూలీలతో సీఎం మమేకమవుతారు. అక్కడ ఎంపికన చేసిన నలుగురి పెన్షనర్లతో మాట్లాడనున్నారు. మెయిన్ రోడ్డు నుంచి చెరువు వరకు రోడ్డును ఆధునీకరించి అక్కడ బారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి ఆలయ సమీపంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడేందుకు వేదికను ఏర్పాటు చేస్తున్నారు.



సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

### భారీ బందోబస్తు..

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసు బలగాలు బస చేసేందుకు ముమ్మిడివరంలోని కల్యాణ మండపాలను సిద్ధం చేశారు. పోలీసు బలగాలంతా ముందురోజే ఇక్కడకు చేరుకోనున్నాయి. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, రిజర్వుడు ఇనస్పెక్టర్లు ముగ్గురు, ఎస్ఐలు, ఆర్‌ఎస్ఐలు 64 మంది, ఏఎస్‌లు, హెచ్‌సీలు, పోలీసు కానిస్టేబుళ్లు 492 మంది, మహిళా పోలీసులు 67 మంది, హోంగార్డులు 88 మంది మొత్తం 751 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాక ఆర్మ్ రిజర్వ్ పార్టీ 35 మంది, ఎనిమిది స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీఎం పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

# రంగా విగ్రహాలు.. రగిలిన ఆందోళనలు!

- అంతర్వేదిలో రంగా విగ్రహం తొలగింపుపై వివాదం, ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన నాయకులు
- కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన వైనం



ధర్నా చేస్తున్న నాయకులు, మహిళలు, గ్రామస్తులు



అంతర్వేది కొత్తపేటలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహం


అంతర్వేది, మే 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొత్తపేట సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఒక వర్గంవారు రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. మరొక వర్గంవారు విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించి పోలీసులకు తెలియచేయడంతో పోలీసులు తెల్లవారుజామున విగ్రహాన్ని తొలగించారు. దీంతో ఆగ్రహించిన కాపు సంఘాల నాయకులు, గ్రామస్తులు విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేస్తూ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఈ తరుణంలో పోలీసులు, రంగా అభిమానులకు మధ్య తోపులాట జరిగింది. రాజోలు నియోజకవర్గ నాయకులు, కాపు సంఘాల నాయకులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి రంగా విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటుచేయాలని నినాదాలు చేశారు. పోలీసులవో వాగ్వాదం చేస్తూ రంగా విగ్రహాన్ని తీసిన చోటే గ్రామస్తులు పెట్టారు. ఈ తోపులాటలో రంగా విగ్రహం చేయి విరిగింది. అనంతరం విగ్రహానికి దండలు వేసి కాపు సంఘ నాయకులు, మహిళలు ధర్నా చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఇరువర్గాలతో చర్చలు జరుపగా అమలాపురం ఆర్డీవో మాధవి, డీఎస్పీ మురళీమోహన్ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోసం ఎదురుచూడ సాగారు. మధ్యాహ్నానికి ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించి ఇరువర్గాలతో చర్చలు జరిపారు. ఇరువర్గాల నుంచి చెరొక ఐదుగురు సభ్యులను స్థానిక పంచాయతీ భవనంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి వారితో మాట్లాడి పరిస్థితులు చేజారిపోకుండా శాంతింపచేశారు. అన్నివర్గాల నాయకుల విగ్రహాలకు ఇబ్బంది లేకుండా విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విగ్రహం ఎత్తు, దిమ్మ, నిర్మాణాలు సక్రమంగా అవతల వారి డిమాండ్ల మేరకు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చి ఇరువర్గాలతో శాంతియుతంగా చర్చలు జరిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, రాజోలు సీఐ నరేష్‌కుమార్, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం ఎస్ఐలు పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకున్నారు. సీఐ నరేష్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తపల్లిలో ధర్నా

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో కాపు నాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగొట్టిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఇటీవల సెంటర్లో ఉన్న రంగా విగ్రహం చేతి వేళ్లను గుర్తు తెలియని వ్యక్తి విరగొట్టాడని, గురువారం తెల్లవారుజామున విగ్రహం చేతి మణికట్టు వద్ద విరగొట్టి పక్కనే ఉన్న చెరువులో విసిరేశారని జనసేన, రంగా యూత్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ విగ్రహాన్ని పరిశీలించి నిందితుడిని గుర్తించి చట్టపరమైన చర్యలు చేపడతామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు. జనసేన నాయకులు కొణమర్తి రాంబాబు,ఆటో పెద్ద, భరత్, రాజారావు, మోకా పెద్దకాపు, బాబులు, మామిడాల రమణ, మోహన రంగాయూత్ సానా లోవరాజు, గంధం గంగ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జనసేన, రంగా యూత్ సభ్యులు



కొత్తపల్లిలో రంగా విగ్రహం చేతులు విరగొట్టిన దృశ్యం

## కొడవలిలో వివాహిత ఆత్మహత్య



మరణించిన నాగమణి

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కొడవలి ఎస్సీ కాలనీకి చెందిన నామా నాగమణి (44) కుటుంబసమస్యలతో ఇబ్బందిపడుతోంది. బుధవారం రాత్రి ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆత్మహత్య చేసుకుందని చెప్తున్నారు. అయితే నాగమణి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని సామర్లకోట మండలం హుస్సేన్‌పురానికి చెందిన ఆమె సోదరి పుప్పాల సూర్యమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మహేష్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మరణించాడు. అడ్డతీగల మండలం జి.కొత్తూరు గ్రామానికి చెందిన బూడిద మహేష్ (33) గురువారం కరెంటు పనులు చేస్తున్నాడు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో హెచ్‌టీ లైన్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర ంగా గాయపడ్డాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. మహేష్ సోదరి మరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ద్రాక్షారామ మే 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు చీమల దిబ్బలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన శీలం కమల(43) మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుయ్యేరు గ్రామం నుంచి ద్రాక్షారామలో వేడుకకు ఆమె మరో వ్యక్తితో కలిసి మోటారుసైకిల్‌పై బయలుదేరారు. ఇరుకైన రహదారిలో వాహనం గోతిలో పడడంతో వెనుక కూర్చున్న కమల జారి రోడ్డుపై పడింది. అదే సమయంలో ద్రాక్షారామ నుంచి కుయ్యేరు వెళ్తున్న లారీ ఆమె పైనుంచి వెళ్లడంతో వెనుకచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

వై.రామవరం, మే 29(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం ప్రధాన రహదారిలో ఈనెల 25న ఆర్టీసీ బస్సు, మోటారు బైక్ ఢీకొని ఇద్దరు యువకులు గాయపడిన విషయం విధితమే. కాగా వీరిలో పనసలపాలెనికి చెందిన పల్లాల నాగిరెడ్డి(22) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మృతిచెందిన పల్లాల నాగిరెడ్డి

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

## వేసవి విజ్ఞాన తరగతులు



పెద్దాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం పుస్తక పఠనం, కథలు చదివించడం, పిల్లల్లో సృజనాత్మక నైపుణ్యాలను ఎలా పెంపొందించాలో వెంకట్రావు మాస్టారు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లయ్య, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానాజీని కలిసి ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

## 'ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా జరిపించాలి'

కాకినాడ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా జరిపించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని కోరారు. గురువారం వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్‌లో ఆఫీసు బేరర్లుగా చేరిన ఉద్యోగులను చేరిన నాటి నుంచి 9 సంవత్సరాల వరకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం క్లారిఫికేషన్ ఇచ్చిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ... అధికారులు నియమ, నిబంధనలు పాటించేలా సూచిస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, సహాయ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఎస్వీ భారతి, కార్యనిర్వాహక కార్యదర్శి వై.రామకృష్ణ, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుజాత, నగర శాఖ ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మి, దుర్గాలత పాల్గొన్నారు.



పరదేశమ్మపేటలో జరిగిన అహల్యాబాయి జయంత్యుత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

## 'హిందూ దేవాలయాల పునరుద్ధరణకు అహల్యాబాయి హోల్కర్ ఎనలేని కృషి'

కాకినాడ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల పునరుద్ధరణకు అహల్యాబాయి హోల్కర్ ఎనలేని కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. జగన్నాథపురంలోని పరదేశమ్మపేట అమ్మవారి గుడి వద్ద గురువారం రాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంత్యుత్సవాన్ని బీజేపీ మహిళా మోర్చా జోనల్ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యురాలు విశ్వనాధపల్లి ఉమామహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. జయంతి సమితి జిల్లా ఇన్‌చార్జి గూటూరు పద్మ, బీజేపీ జిల్లా కార్యదర్శి పక్కి మణిబాల, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విశ్వనాధపల్లి శ్రీనివాసరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ గంగరాజు, సంగాని సత్యం, మత్స్యకార సంక్షేమ సమితి కోశాధికారి పొన్నమండ వెంకటరమణ, దొడ్డి వీరేంద్రకుమార్, తమ్ము యోగేశ్వర్, కుడిపూడి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్, నాయకులు

## 'ఎస్సీ వర్గీకరణను వెంటనే ఆపాలి'

కాకినాడ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ముసుగులో దళితుల ఐక్యతను రాజకీయ పార్టీలు దెబ్బకొడుతున్నాయని, తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను వెంటనే ఆపాలని మాల మహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ గురువారం సాయంత్రం ఆయన ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ సెంటరు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వర్గీకరణతో మాల సామాజికవర్గం పూర్తి ఉనికి కోల్పోతుందన్నారు. నాయకులు చిన్నం వెంకటేశ్వరరావు, ముప్పిడి దాసు, బొల్లం ప్రసాదరావు, కాకర రవితేజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒకటి నుంచి రేషన్ దుకాణాల ద్వారానే సరుకుల పంపిణీ

సామర్లకోట, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జూన్ ఒకటి నుంచి రేషన్ సరుకులను రేషన్ దుకాణాల ద్వారానే సరఫరా చేస్తామని తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎంఎస్‌వో కమలకుమారి ఆధ్వర్యంలో గురువారం ఆయన మండల, పట్టణ పరిధిలోని రేషన్ డీలర్లతో సమీక్షించారు. ఒకటి నుంచి ఐదో తేదీ వరకు వృద్ధులకు, దివ్యాంగులకు, అనారోగ్యంతో కదలలేని వారికి ఇంటి వద్దే రేషన్ అందిస్తామన్నారు. ఒకటి నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల వద్ద సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల నిర్వహణను వీఆర్వోలు పర్యవేక్షించాలన్నారు. డోర్ డెలివరీ లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వీఆర్వోలకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాసు, కార్యాలయ సూపరింటెండెంట్ పద్మ పాల్గొన్నారు.



తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి



## శ్యామ్ కుటుంబానికి మాజీ ఎంపీ గీత సాయం

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వేటకు వెళ్లి మరణించిన ఉప్పాడకు చెందిన మత్స్యకార యువకుడు మేరుగు శ్యామ్ కుటుంబాన్ని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ గురువారం పరామర్శించారు. రూ.5వేల నగదు, నిత్యావసరాలు అందించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తామని చెప్పారు. ఆమె వెంట వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పలువురు నాయకులు వున్నారు.



శ్యామ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న గీత

# పవన్ తెచ్చిన పనులకు వైసీపీ బ్రేక్

- సమాచారం ఇవ్వకుండా ఎలా పెడతారు
- వాయిదా వేయాలని వైసీపీ కౌన్సిలర్ల డిమాండ్
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్‌లో వారిదే మెజార్టీ
- పనులు ఆమోదించకుండా వాయిదా

గొల్లప్రోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో నగర పంచాయతీకి ప్రత్యేకంగా మంజూరైన కోటి రూపాయలతో ప్రతిపాదించిన పనులకు వైసీపీ కౌన్సిలర్లు మోకాలడ్డారు. తమకు సమాచారం ఇవ్వకుండా, మీరు పెట్టిన పనులకు మేము ఎందుకు ఆమోదం తెలపాలని ప్రశ్నించారు. ఆపై వారి డిమాండ్‌తో జూన్ 5వ తేదిన మరో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

గొల్లప్రోలులో అభివృద్ధి పనుల నిర్వహణకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ ద్వారా రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో పట్టణ పరిధిలో 27 పనులు చేసేందుకు గురువారం చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగిన నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశానికి తీసుకువచ్చేందుకు కమిషనరు కనకారావు టేబుల్ అజెండా రూపొందించారు. దీనికి వైసీపీకి చెందిన చైర్‌పర్సన్ మంగతాయారు ఆమోదం తెలపకపోవడంతో కమిషనరు సంతకంతోనే పనులను టేబుల్ అజెండాగా సమావేశం ముందుకు తీసుకువచ్చారు. పనులు ఎక్కడో ఏమిటో, వాటిని పరిశీలించకుండానే తాము ఎలా ఆమోదిస్తామని వైసీపీ కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి తదితరులు ప్రశ్నించారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని, ఇవే పనులు ప్రతిపాదిస్తే ఆమోదించమని స్పష్టం చేశారు. నాలుగేళ్ల తర్వాత తన వార్డులో పనులు పెడితే అడ్డుకుంటారా అని టీడీపీ సభ్యుడు గుళ్ల సుబ్బారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో సుబ్బారావు, చైర్‌పర్సన్ భర్త గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి మధ్య వాగ్వాదం జరిగింది. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని కమిషనరు కనకారావు ప్రతిపాదించారు. కౌన్సిల్‌లో వైసీపీకి మెజార్టీ ఉండడంతో ఈ అంశాన్ని జూన్ 5కి వాయిదా వేస్తూ తీర్మానించారు. ఇదే సమయంలో పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు జరగట్లేదని వైసీపీ కౌన్సిలర్లు వ్యాఖ్యానించడం కొసమెరుపు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీ సమయం నుంచి ఉన్న కరెంటు బిల్లుల బకాయిలను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించిందని, దీంతో రూ.9.20కోట్లను వాటికి ప్రత్యేకించామని కమిషనరు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగట్లేదని వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారావు, గంటా అప్పలస్వామి, మైనం భవానీరాజా తెలిపారు. వీధి లైట్ల నిర్వహణకు టెండర్లు పిలిచామని, 5వ తేదీ సమావేశానికి తీసుకువస్తామని కమిషనరు తెలిపారు. రూ.15లక్షలతో పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారని, ఎక్కడా పనులు జరగట్లేదని కౌన్సిలర్లు చెప్పారు. పనులు జరగలేదని, వాటికి ఎటువంటి బిల్లులు చెల్లించమని, కాంట్రాక్టరును బ్లాక్ లిస్ట్‌లో పెడతామని కమిషనరు చెప్పారు.



కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం

# రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు 12 మంది ఎంపిక

పిఠాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కాకినాడ జిల్లా బాక్సింగ్ పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 45 మంది బాక్సర్లు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ వి.కేశవరావు, పి.సురేష్, రమణ, కె.చిన్నబ్బాయి, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం, బాక్సింగ్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.లక్ష్మణరావు పోటీలను ప్రారంభించి బహుమతులు అందజేశారు.

బాలికల విభాగం... 50 కేజీల కేటగిరీలో పి.మహాలక్ష్మి (పిఠాపురం), 54 కేజీలు ఎల్.రిషిక (కాకినాడ), 57 కేజీలు కె.హర్షిణి (పిఠాపురం), 60 కేజీలు సీహెచ్ శ్వేత అంశిక (కాకినాడ), 63 కేజీలు ఎల్.లాస్య (కాకినాడ), 80 కేజీలు పైబడిన విభాగంలో జే.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం), బాలుర విభాగం... 46 కేజీల కేటగిరీలో పి.నాని (పిఠాపురం), 48 కేజీలు డి.రాహుల్ (కాకినాడ), 57 కేజీలు జె.గౌతమ్ (కాకినాడ), 75 కేజీలు జె.రాఘవేంద్ర అరుణ్ (పిఠాపురం), 80 కేజీలు ఎం.అజిత్ హర్ష (తుని), 80 కేజీలు పైబడిన కేటగిరీలో జె.రాఘవేంద్ర ఆదిత్య (పిఠాపురం) స్వర్ణ పతకాలు సాధించారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 31న విశాఖపట్టణంలో బాలికలకు, జూన్ 2న గాజువాకలో బాలురకు జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాక్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు.



స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాక్సర్లు

# అకాల వర్షాలతో తగ్గిన గిరాకీ

బాగా తగ్గిన కొత్తపల్లి కొబ్బరి, బంగినపల్లి ధరలు

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో మామిడి పండ్ల ధరలు బాగా తగ్గాయి. మామిడి పండ్లలో రారాజు కొత్తపల్లి కొబ్బరి. బంగినపల్లి రకాన్ని మధుర ఫలంగా చెప్పుకోవచ్చు. వేసవి కాలంలో మార్కెట్లో వచ్చే వివిధ రకాల మామిడి పండ్లలో అందరి దృష్టినీ ఆకర్షించేది కొత్తపల్లి కొబ్బరే. ఈ ఏడాది వేసవిలో అకాల వర్షాలు కురిశాయి. దీంతో సరిగా పక్వానికి రాకపోవడం, ముగ్గడానికి కొట్టిన మందు సరిగా ఆరకపోవడం వంటి కారణాలతో మామిడి పండ్లపై మచ్చలు ఏర్పడ్డాయి. నిగనిగలాడే కొత్తపల్లి కొబ్బరి రకం నల్లమచ్చలతో మార్కెట్లోకి అమ్మకానికి వచ్చాయి. గతంలో కొత్తపల్లి కొబ్బరిని ఎంత ధర అయినా కొనుగోలు చేసి దూర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులకు, రాజకీయ ప్రముఖులకు బహుమతిగా పంపించేవారు. అయితే అకాల వర్షాలతో కొత్తపల్లి కొబ్బరి మామిడి పండ్లు పరక (14) ధర రూ.150-200కు పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్లో కొత్తపల్లి కొబ్బరి, బంగినపల్లి రకాలకు అంత గిరాకీ లేకపోవడంతో వాటిని వ్యాపారస్తులు తెలిసిన వాళ్లకు ఎంతో కొంత రేటుకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.





బాలికకు ఇంటర్ అడ్మిషన్ ఇస్తున్న సమగ్ర శిక్షా ఏఎంవో జగన్మోహన్

## 'అధ్యాపకుల కృషి అభినందనీయం'

సర్పవరం జంక్షన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌ని సమగ్ర శిక్షా ఏఎంవో వి.జగన్మోహన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఏఎంవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఇక్కడకు వచ్చానన్నారు. ఇంటర్మీడియట్‌లో సుమారు 100 మందికి పైగా విద్యార్థుల ప్రవేశానికి అధ్యాపకులు చేసిన కృషిని అభినందించారు. నిర్మాణంలో ఉన్న పీఎంశ్రీ సైన్స్ ల్యాబ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన సముదాయం, తరగతి గదులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకునే విధానాన్ని పరిశీలించారు. హైస్కూలు ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్, కందుకూరి పాల్ రాజు, జగదీష్, అలెక్స్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సత్కారం

సర్పవరం జంక్షన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట శుభానికేతన్ సమీపంలోని జనచైతన్య కాలనీ వాసులు గురువారం గొడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసానికి విచ్చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడమే కాకుండా విద్యుత్ సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే దంపతులను సత్కరించారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

## పిఠాపురంలో యోగాంధ్ర

పిఠాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో యోగాంధ్ర నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి గురువారం యోగా శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, యోగా గురువు వనం సత్యప్రియ, కోచ్‌లు వెంకట్, స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న దృశ్యం

## దుర్గాడలో ఉచిత మెగా వైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా గొల్లప్రోలు మండలం దుర్గాడలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్తికేయ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ కొమ్మూరు గోవిందబాబు, కర్రి దివ్య, ఆదినారాయణ, వై.ఇలియాస్ సుమారు 600 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం పట్టణం పూర్తిగా, కోలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగపురం గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

**సామర్లకోట (ఆంధ్రజ్యోతి):** రోడ్డు విస్తరణ పనుల కారణంగా సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బ్రౌన్‌పేట నుంచి కోదండ రామపురం వరకు విద్యుత్ తీగలు మార్పు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పువారి సత్రం ఏరియా, టిడ్కో గృహాల సముదాయం, జల్లూరు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు పెద్దాపురం డీఈఈ ఏఎంఎన్డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో ఉమారామలింగేశ్వరస్వామి

## ఆరుద్ర నక్షత్ర పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్ర పూజలు నిర్వహించారు. మహాగణపతి పూజ అనంతరం పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లలితాదేవికి లలితా సహస్రనామాలతో కుంకుమార్చన జరిపించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పుష్పాలతో అలంకారం చేసి సప్తరుషి హారతి, నక్షత్ర హారతి సమర్పించారు.

## ఎస్సీ యువతకు లెదర్ ఫుట్‌వేర్ తయారీలో శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో లిడ్‌క్యాప్, సీడాప్ ద్వారా లెదర్ ఫుట్‌వేర్ తయారీ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు షెడ్యూల్డు కులాల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకురాలు జె.సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లెదర్ స్టిచ్చింగ్ ఆపరేటర్, లెదర్ ఫుట్‌వేర్, లెదర్ కట్టర్ ఫుట్‌వేర్‌లో 45 నుంచి 60 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. వయసు 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండి 10వ తరగతి పాస్ (లేదా) ఫెయిల్ అయినవారు అర్హులన్నారు. గుంటూరు జిల్లా నల్లపాడులోని శ్రీకృష్ణసాయి ఎడ్యుకేషన్ సొసైటీలో శిక్షణ ఇస్తామని, శిక్షణాకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో శిక్షణకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 90309 24569, 79813 49691 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

# జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): నరేంద్రపట్నం 11కేవీ, ఇర్రిపాక 11 కేవీ ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇర్రిపాక, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాల్లో బోర్లకు, కేటీపల్లి, వెంగాయమ్మ పేట, ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరాకు అంతరాయంఉంటుందని ఈఈ వీరభద్రరావు పేర్కొన్నారు.

# రంపచోడవరం

• రంపచోడవరం, మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

## గుండాలలో రహదారులు నిర్మించాలని రిలే దీక్ష



రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఎటపాక, మే 29(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం గుండాల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రహదారులను నిర్మించాలని డిమాండ్ కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ఎదుట గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈదీక్షను సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండాల ఇసుక ర్యాంపు ద్వారా గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు కొంత గ్రామాభివృద్ధికి కేటాయించే అవకాశం ఉన్నా, అధికారులు నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇసుక ర్యాంపు నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంలో కొంతమేర గ్రామాభివృద్ధికి కేటాయించాలని గతంలో అధికారుల నిర్ణయం చారని చెప్పారు. 15ఏళ్లుగా రహదారులు లేక బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీపీఎం అనేక పోరాటాలు, రాస్తారోకోలు చేసిందన్నారు. రహదారులు నిర్మించక పోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా పార్టీ సభ్యులు ఐవీ, ఇరపా సత్యం, హుస్సేన్, ఈట శ్రీను పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలు తొలగిస్తాం: పీవో



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాల్లో ప్రధాన రోడ్లకు ఇరువైపులా అక్రమ కట్టడాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగిస్తామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ కుమార్‌తో కలిసి రెవెన్యూ, రోడ్లు, భవనాలు, పోలీసు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ 1/70 చట్టానికి విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అక్రమ కట్టడాలు తొలగించేందుకు మండలంలో 10జేసీబీలు ఏర్పాటు చేశామన్నారు. గిరిజనాభివృద్ధికి కొందరు గిరిజన నేతలు ఆటంకం కలిగిస్తున్నారని తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అక్రమ కట్టడాలు తొలగించే సమయంలో మెడికల్, అంబులెన్స్, పోలీసుశాఖలను అందుబాటులో ఏర్పాటు చేశామన్నారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరంలో 340, మారేడుమిల్లిలో 218మందికి అక్రమ కట్టడాలకు సంబంధించిన నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. తొలగింపునకు గిరిజనులు, గిరిజన నేతలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దారు బాలాజీ, సీఐ రవికుమార్, ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్‌దొర, డిప్యూటీ తహశీల్దార్లు శివ, శ్రీధర్, స్వామి, జలాని, ఎస్ఐలు వెంకటేష్, పరిష్, సార్థసారథి, శ్రీనివాసరావు, వెంకటేష్, భూషణం, ఏఈలు శ్రీనివాసరావు, రాజశేఖర్, ఆర్ఐలు సీహెచ్ నిర్మల, ఏసుబాబు, సర్వేయర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కూనవరం సచివాలయం ప్రారంభం ఎప్పుడో?



ప్రారంభానికి నోచుకోని కూనవరం సచివాలయం

కూనవరం, మే 29(ఆంధ్రజ్యోతి): కూనవరంలో సచివాలయ నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభించి ఐదేళ్లుగా నిర్మాణం కొనసాగించారు. ఎట్టకేలకు సచివాలయ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ఇంత వరకు ప్రారంభించలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సచివాలయం ప్రారంభం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. కూనవరం మేజర్ పంచాయతీ కావడంతో సమస్యలపై అధిక సంఖ్యలో ప్రజలు సచివాలయానికి వస్తున్నారు. ఇప్పుడున్న పంచాయతీ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో ఒక్కోసారి కార్యాలయానికి వచ్చిన ప్రజలు బయట నుంచే పనులు చేయించుకోవాల్సి వస్తుంది. పంచాయతీ, సచివాలయం ఒకే కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించడంలో జాప్యం కారణంగానే సచివాలయం ప్రారంభం కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్‌కు రూ.18లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఏంతైనా ఐటీడీఏ పీవో జోక్యం చేసుకుని కూనవరం సచివాలయాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

## అసంపూర్తిగా మోతుగూడెం సచివాలయం



మోతుగూడెంలో నిర్మాణం పూర్తికాని సచివాలయం

మోతుగూడెం, మే 29 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సచివాలయ భవనం ఐదేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన సచివాలయ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. పంచాయతీ భవనంలోనే సచివాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే పంచాయతీ భవనం స్లాబ్ లీక్ అవుతుంది. సచివాలయ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## చినుకు పడితే చిత్తడే

● అధ్వానంగా రహదారులు



ఇందుకూరులో అధ్వానంగా ఉన్న రహదారి

దేవీపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నపాటి వర్షానికి ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారుతున్నాయి. ఇందుకూరు నుంచి పెయ్యలపల్లి, కొత్తపేట, కమలం పాలెం నుంచి శరభవరం తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలుగా మారి దయనీయంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం రహదారులను పూర్తిగా విస్మరించడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా రహదారులను పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే అధ్వాన రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రీ సర్వే నత్తనడకపై తహశీల్దార్ ఆగ్రహం

తొండంగి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే నత్తనడకగా సాగడం పట్ల వీఆర్వోలు, సర్వేయర్లపై తహశీల్దార్ మురార్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. గురువారం ఆయన బెండపూడి గ్రామంలో జరుగుతున్న రీసర్వేపై మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే నిమిత్తం 17 బృందాలు ఏర్పాటు చేయగా దీనికి సంబంధించిన అంశాలపై వీఆర్వోలు, సర్వేయర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడం పట్ల తహశీల్దార్ మండిపడ్డారు. సమీక్షా సమావేశానికి కొందరు సరైన సమాచారంతో రాకపోవడంతో ఉన్నతాధికార్ల నుంచి నిర్ణీత సమయంలో రీసర్వే పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ణీత గడువులోగా రీసర్వే పూర్తిచేయాలని, ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కొందరు గ్రామ సర్వేయర్లు పట్టణాల్లో ఉండడం పట్ల ఆయన ఆగ్రహించి, సక్రమంగా పనిచేయని వారి వివరాలు జిల్లా ఉన్నతాధికార్లకు నివేదిస్తామన్నారు. సమావేశంలో సర్వే డిఐ, ఆర్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## తాటిమానే దిక్కు?

● వంతెన లేక ఇబ్బందులు పడుతున్న బొద్దవరం రైతులు
● తాండవ ఏటికిఆవల అవతల వందల మంది వ్యవసాయ భూములు
● వర్షాలు పడే సమయంలో పశువులకు మేత వేయలేకపోతున్నామని ఆవేదన



తాండవ ఏరు దాటేందుకు అడ్డంగా వేసిన తాటిమానుపై వెళ్తున్న రైతు

కోటనందూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): బొద్దవరం గ్రామంలో సుమారు 300 మంది రైతులు పంటపొలాలు ఉన్నాయి. వీటికి వెళ్లాలంటే బొద్దవరం గ్రామశివారు శివాలయం వద్ద గల రైతులు తాండవ ఏరు దాటి వెళ్లాలి. ప్రస్తుతం ఏరుదాటేందుకు చాలాకాలంగా అడ్డంగా తాటిమాను వేసుకుని దానిపై నుంచి వెళ్లి పొలం పనులు చేసుకుని పశువులకు మేతవేసి వస్తున్నారు. అయితే గత ఐదు రోజులుగా విపరీతంగా వర్షాలు పడడంతో ఏరు ఉధృతంగా ప్రవహించడంతో పొలంలోకి వెళ్లలేక పశువులకు మేతవేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మించాలని చాలా కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరినప్పటికీ హామీలు ఇస్తున్నారు తప్ప వంతెన నిర్మించలేదని తెలుపుతున్నారు. దీంతో పశువులకు మేత కూడా వేయని పరిస్థితి ఉంది. సొంత నిధులతో చిన్నపాటి వంతెన నిర్మించుకోవడానికి రైతులు పూనుకున్నారు. అయితే పనులు చేపట్టాలని 1100 మంది ఏటి వద్దకు వెళ్లగా నీరు ఎక్కువగా ఉండడంతో వెనక్కి వచ్చేశారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించి మా పొలాలకు వెళ్లే మార్గం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



వంతెన నిర్మించాలని కోరుతున్న రైతులు

## అభివృద్ధి పనులకు ఆమోదం



ఏలేశ్వరం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. గురువారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కుమార్ అజెండాలోని అంశాలను చదవగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని, అమలుచేసే తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. 20 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, బదిరెడ్డి గోవింద్ అధికారులను కోరారు.

## వీరవరంలో నీటి సరఫరా

కిర్లంపూడి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరంలో నీటి సరఫరా నిలిచిపోవడంతో ఈ విషయాన్ని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో నీటి సరఫరాకు అటంకం ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామంలో ఇంటింటికీ నీటిని సరఫరా చేయాలని జనసైనికులను ఆదేశించారు. దీంతో జనసైనికులు వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంటింటికీ నీటిని సరఫరా చేయడంతో ప్రజలు సంతోషించారు. సత్యనారాయణ, సుబ్బారావు, వీరబాబు, గౌరీ శంకర్, చిన్న, కుమార్, భీమనాయుడు నాగు ఉన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి

దేవీపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో నిర్వహించిన మహానాడులో పోలవరం నిర్వాసితుల సమస్యలను రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తెచ్చారు. రంపచోడవరంలో జిల్లాలో జరిగిన మినీ మహానాడులో టీడీపీ దేవీపట్నం మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరరావు నిర్వాసితుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తీర్మానం చేశారు. కడప మహానాడులో సీఎం చంద్రబాబుకు నిర్వాసితుల సమస్యలను వివరించామని కన్వీనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## రేపు పింఛన్ల అందజేత

శంఖవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈనెల 31న లబ్ధిదారులకు అందజేస్తామని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. జూన్ 1 ఆదివారం రావడంతో ముందురోజునే పింఛన్లు అందజేయాలని, సాయంత్రానికి ఎక్కువశాతం పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

## యోగాతో శారీరక, మానసిక రుగ్మతలు దూరం



శంఖవరంలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు

శంఖవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగుతాయని ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### కోటనందూరులో ర్యాలీ

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ సుభాష్, ఎస్ఐ రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం నుంచి చైతన్యస్కూల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. చైతన్య స్కూల్ నందు ఎంఈవో రామశేఖర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ర్యాలీలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మురళీరాజు గెస్ట్‌హౌస్‌లో జూన్22,3,4న హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ శ్రీ రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో ధ్యానోత్సవం పేరుతో నిర్వహించే ఉచిత ధ్యాన శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను, పోస్టర్‌లను గురువారం వైసీపీ పార్లమెంట్ నర్సాపురం పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆవిష్కరించారు. ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పెదిరెడ్డి గంగారావు తదితరులున్నారు.

## 'గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

తొండంగి, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వరరావు గ్రామైక్య సంఘాలకు సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో జరిగిన నీరు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయ సంఘాల సభ్యులు పరిసరాల పరిశుభ్రతపై సభ్యులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగు నీటివలుగనుక కారణంగా అనేక రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన నీటిని తాగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్య స్వావలంబన సాధించే విధంగా మహిళలను ప్రోత్సహించాలన్నారు. మహిళా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామైక్య సంఘాల ప్రతినిధులు వీటన్నింటిని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మార్కండేయులు, ఏపీఎం సత్తిబాబు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి జ్యోతుల నవీన్ విరాళం



విరాళం అందజేస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడులో పాల్గొనడానికి కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ వెళ్లిన సందర్భంగా ప్రసిద్ధ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో (కడప టీటీడీ అనుబంధ ఆలయం)లో స్వామివారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.15వేలు విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో రావ్ల తెలుగు యువత ఉపాధ్యక్షు అడబాల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కోర్పు సాయితేజ, ఎలెటి బాబి, జాస్తి వసంత్, అడబాల అంజనేయులు, తూము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి

తునిలో సీపీఎం నాయకులు, కార్యకర్తల సమైక్యత యాత్ర




తునిలో సమైక్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

తుని రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలని కోరుతూ తుని గొల్లప్రోలు సెంటర్లో సీపీఎం నాయకులు సమైక్యతా యాత్ర ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన భారతీయులకు నివాళులర్పించారు. సీపీఎం నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తీవ్రవాదం, మతోన్మాదం దేశానికి ప్రమాదమన్నారు. తీవ్రవాదానికి కులం, మతం లేదని, విశ్వజన వినాశనమే ఉగ్రవాదం కోరుకుంటుందన్నారు. పహల్గాం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. పహల్గాం ప్రాంతానికి ఉగ్రవాదులు ఎలా వచ్చి బారతీయులను చంపి ఎలా వెళ్లారో సమగ్రమైన విచారణ జరపాలన్నారు. పాకిస్తాన్ గూఢాచారి ఏజెంట్ జ్యోతి మల్హోత్ర యూట్యూబ్ చానల్ ద్వారా భారత దేశ రహస్యాలు పాకిస్తాన్ చేరవేస్తుందని, కేంద్ర నిఘా సంస్థ వైఫల్యంతో జ్యోతి మల్హోత్రను పట్టుకుందని, ఇలాంటి వాళ్లను కఠినంగా శిక్షించాలన్నారు. మతం పేరుతో విభజన చేయడం దారుణమని సీపీఎం నాయకులు శ్రీనివాస్ అన్నారు. సత్యకూడేవి, సయ్యద్‌హుసేన, రామచంద్రరావు, గొర్ల రమణ పాల్గొన్నారు.

## నూరు శాతం అడ్మిషన్లు కల్పించాలి

రంపచోడవరం, మే 29(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి రంపచోడవరం, ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నూరు శాతం ప్రవేశాలు కల్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. గురువారం ఆయన డిప్యూటీ డైరెక్టర్‌తో ఎంఈవోలు,హెచ్ఎంలతో కలిసి విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పాఠశాలలు,వసతిగృహాల్లో కొలేషన్ వేయించాలన్నారు. ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణమోహన్, జల్లి శంభుడు, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### రేపు పింఛన్ల పంపిణీ

దేవీపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో మే 31వ తేదీ శనివారం పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో టేకుమూరి తెలిపారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే సత్యప్రభ సత్కారం



చంద్రబాబుతో ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా కడప మహానాడు వేదికపై మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అభినందించారు. చంద్రబాబుకు శాలువా కప్పి బొకే అందజేశారు. కడపలో మహానాడు దిగ్విజయం జరిగేందుకు సహాయపడిన కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవరెడ్డిని ప్రత్తిపాడు, రంపచోడవరం ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీషదేవి అభినందించారు. వారు మాధవిరెడ్డికి సత్యదేవుడి చిత్రపటం, జ్ఞాపిక అందజేశారు.

## పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

గండేపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఏపీ పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష చివర రాత పరీక్ష జూన్ 1న జరగనుంది. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలను గురువారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు ఉన్నారు.

## గణపతి ఆలయం ప్రారంభం

శంఖవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): శంఖవరం మండలం తాడువాయి దొప్పెర్ల గ్రామంలో గురువారం విజయ గణపతి స్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయాన్ని రౌతులపూడికి చెందిన ఇటంశెట్టి కొండబాబు, సూరరత్నం దంపతులు సొంత నిధులతో నిర్మించారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. గొల్ల రామకృష్ణ, అల్లు రాజుబాబు, సింగంపల్లి సతీష్ తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

తొండంగి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లయ్యపేట గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అన్నవరం సూర్య ఎమర్జెన్సీ ఆసుపత్రికి చెందిన వైద్యులు డాక్టర్ కోమాకుల శివప్రసాద్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోడ వెంకటరమణ తదితరులున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న శివప్రసాద్